క్లుప్తంగా

ఘనంగా కృష్ణమాచార్యుల జయంతి



దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్: ఆదోని పట్టణంలో ఆదివారం దాశరథి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలను లలితకళ రంగస్థలం వేదికలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ జి.నల్లారెడ్డి, ముఖ్య అతిథిగా విశ్రాంత తహసీల్దార్ షేక్షావలి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దాశరథి కృష్ణమాచార్యులు సమాజానికి, సినిమా రంగానికి ఎనలేని సేవలు చేశారన్నారు. బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతిగా నిలిచారన్నారు. దాశరథి జయంతి వేడుకలను ప్రభుత్వం తరఫున నిర్వహించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సంగీత కళాకారులు బండేగౌడ్, అబ్దుల్లా, శివరాములు, లక్ష్మన్నయాదవ్, రవిప్రకాష్, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



ఆదోనిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆదోనిఅర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా), అవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఆదోని ఆర్యవైశ్య హాస్టల్‌లో జరిగిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. దాదాపు 350 మంది పరీక్షలు చేయించుకోగా 150 మందిని ఆపరేషన్ కోసం నంద్యాల శాంతిరామ్ ఆస్పత్రికి తరలివచినట్లు అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. కంటి వైద్య శిబిరానికి భారీ స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. మున్ముందు ఇలాంటి క్యాంపులు ఎన్నో నిర్వహిస్తామని చెప్పారు. ఉచిత క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సభ్యులు నగేష్, రాచోటి సుధాకర్, ఓ.జి.నాగరాజు, సురేష్, కాశేపల్లి విశ్వనాథ్, రంగనాయకులు, కార్యదర్శి మిర్యాల శ్రీధర్, అవోపా మహిళా విభాగ్ అధ్యక్ష కార్యదర్శులు బి.సంగీత, వి.మమతాశ్రీ, హిమబిందు, గీత తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన



వరద నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు

ఆదోనిటౌన్: ఆదోని పట్టణంలోని అమరావతి నగర్‌లో ఆదివారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఆ ప్రాంత ఇన్‌చార్జ్ ఎర్రిస్వామి పర్యటించారు. నాలుగైదు రోజులు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో కాలనీలో వరద నీరు ఇళ్ల ముందు ప్రవహిస్తూ రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని, కాలువలు, రోడ్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ఎర్రిస్వామి కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఏయే వీధుల్లో ఏ సమస్యలు ఉన్నాయో నివేదికలు తయారు చేసి సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ చెప్పారు. ఎంబజీ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న పోలీసులు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామ సమీపంలో కంబయ్యకట్ట వద్ద అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఒక వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య ఆదివారం రాత్రి విలేకరులకు తెలిపారు. గవిగట్టు గ్రామానికి చెందిన ఉప్పర మహదేవప్ప అక్రమంగా తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోటార్ సైకిల్‌పై 182 మద్యం ప్యాకెట్లను (90ఎంఎల్) తరలిస్తుండగా పక్కా సమాచారంతో పట్టుకున్నట్లు తెలిపారు. మోటార్ సైకిల్, మద్యం ప్యాకెట్లను సీజ్ చేసి, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. అక్రమ కర్ణాటక మద్యం సరఫరాపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు.

నాటుసారా విక్రేతల అరెస్ట్

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరులో నాటుసారా విక్రయిస్తున్న ఆరుగురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ మురళీ మోహన్ తెలిపారు. సారా అమ్ముతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకొని 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు.

చేనేతలకు అండగా ప్రభుత్వం

ఆదోని సెంట్రల్: ఆర్థికంగా చితికిపోయిన చేనేతలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాజరాజేశ్వరి కళ్యాణ మండపంలో చేనేతల సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో చేనేతల కష్టాలను కళ్లారా చూసి వారికి నేతన్న నేస్తం కింద ఆర్థిక సహాయం అందిస్తున్నారని కొనియాడారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.24 వేలు చొప్పున పట్టణంలో 280 మందికి నాలుగేళ్లలో రూ.2,68,80,000 పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ సంవత్సరం 17 మందికి అదనంగా లబ్ధి చేకూరిందన్నారు. అవినీతికి తావు లేకుండా ఈ ఏడాది మొత్తం 297 మందికి రూ.71.28 లక్షలు వారి ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ఓర్వలేక ప్రతిపక్ష పార్టీల నాయకులు పవన్‌కళ్యాణ్, చంద్రబాబునాయుడు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం నమ్మవద్దని సూచించారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్లు దుర్గప్ప, సీహెచ్.లోకేశ్వరి, సొసైటీ సభ్యుడు చంద్రశేఖర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో కలిసి సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

ఆదోనిటౌన్: అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందిస్తామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో.. పట్టణంలోని 17, 18 వార్డుల పరిధిలోని 135 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందిస్తామన్నారు. 17, 18 వార్డుల్లో 135 పట్టాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పంపిణీ చేసి ఇచ్చిన హామీని నెరవేర్చామన్నారు. బైపాస్ రోడ్డుకు సమీపంలో ఆ స్థలాలు ఉన్నాయని, దళారుల మాటలను నమ్మి అమ్ముకొని నష్టపోవద్దని సూచించారు. ఎల్లో మీడియా, ప్రతిపక్ష నాయకుల అసత్య ప్రచారాలు నమ్మవద్దన్నారు. టీడీపీ హయాంలో నియోజకవర్గంలో ఒక్కరికైనా ఇంటి పట్టా ఇచ్చారా అని ప్రశ్నించారు. సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, వలంటీర్, గ్రామ, వార్డు సచివాలయాల సేవలను రద్దు చేయించేందుకు ప్రతిపక్ష పార్టీల నాయకులు చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారని, విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. గతంలో 600 హామీలను ఇచ్చిన చంద్రబాబునాయుడు ఒక్క హామీ అయినా పరిష్కరించారా అని ప్రశ్నించారు. కౌన్సిలర్లు చలపతి, చిన్నా, వీఆర్వో జయరామిరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ తిమ్మప్ప, నాయకులు విశ్వనాథ్, లక్ష్మీనారాయణ, మధు, రామంజి, మహేంద్ర పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సాయి

వైఎస్సార్‌సీపీలో చేరిక

ఆదోనిటౌన్: పట్టణంలోని 4వ వార్డు గణేష్‌సర్కిల్ వీధిలో నివాసముంటున్న వడ్డె రామ్మోహన్, శివాజీ, నాగరాజు, ముస్తక్‌లతో పాటు మరో 26 కుటుంబాలు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. తాము బీజేపీలో ఎంత కష్టపడి పనిచేసినా తగిన గుర్తింపు లేకపోవడం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు రామ్మోహన్ చెప్పారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎవరికీ ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తామని, అన్ని వర్గాలకు అండగా ఉంటామన్నారు. సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కౌన్సిలర్ మహేశ్వరి గోవిందరాజులు, లక్ష్మీనారాయణ, గోవిందరావు, నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ నాయకులు

వివాహిత ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లలితమ్మ

ఆదోనిఅర్బన్: హొళగుంద మండలం సుళువాయి గ్రామానికి చెందిన వివాహిత లలితమ్మ ఆదివారం కుటుంబ కలహాలతో పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారకస్థితిలో ఉన్న లలితమ్మను వెంటనే ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

కోతి దాడిలో మహిళకు గాయాలు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని కొత్త బస్టాండు సమీపంలో నివశిస్తున్న ఉమ అనే మహిళను ఆదివారం కోతి కరవడంతో గాయాలపాలైంది. వెంటనే బంధువులు ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మహిళ ఇంటి ముందు కూర్చొని ఉండగా నల్లమూతి కోతి కరిచి వెళ్లిపోయిందని బంధువులు తెలిపారు.

అత్యాచారయత్నం కేసు నమోదు

ఆదోనిరూరల్: మండలంలోని కపటి గ్రామానికి చెందిన బోయ చంద్ర అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయాపై అత్యాచారానికి ప్రయత్నించిన కేసులో నిందితుడిపై అత్యాచారయత్నం, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు ఆదివారం రాత్రి విలేకరులకు తెలిపారు.

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌లో జాప్యం తగదు

ఆదోని సెంట్రల్: పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ నిర్వహణలో తీవ్ర జాప్యం చేయడం తగదని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్ వాపోయారు. ఆదివారం ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో ఆర్‌పీఎస్ఎఫ్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు పూర్తవుతున్నా పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ ఎప్పుడు నిర్వహిస్తారో తెలియక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. మైనార్టీ కళాశాలలో కన్వీనర్ కోటా 50 శాతం ఉండగా దాన్ని 70 శాతం పెంచాలనే ప్రతిపాదన పెండింగ్‌లో ఉందని, అది పూర్తయితే గాని కౌన్సెలింగ్ జరిగే అవకాశాలు లేవన్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి కౌన్సెలింగ్ త్వరగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలు, రాష్ట్ర నాయకులు షాహిద్, అఫ్రిది డివిజన్ నాయకులు అర్జున్, వంశీ, వీరంజి, అశోక్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోసిగిలో చోరీ

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో నాగన్న కట్ట పక్కనే నివాసం ఉంటున్న వేదపండితులు జయతీర్థ ఆచార్ స్వామి ఇంట్లో దొంగతనం జరిగింది. ఆయన ఈనెల 14న కుటుంబ సమేతంగా ఇంటికి తాళం వేసి బెంగళూరుకు వెళ్లారు. ఇదే ఆసరాగా తీసుకున్న దొంగలు ఇంటికి వేసిన తాళం పగులకొట్టి చోరీ చేశారు. ఆదివారం ఉదయం స్థానికులు ఇంటి తలుపులు పగిలి ఉండడం చూసి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. స్వామికి ఫోన్ చేసి సమాచారం అందించారు. అలాగే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఇంటికి వెళ్లి పగిలి ఉన్న గేటుకు మరో తాళం వేసి వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం జయతీర్థ ఆచార్ స్వామి గ్రామానికి చేరుకుని పోలీసుల సమక్షంలో ఇంట్లోకి వెళ్లి బీరువా తలుపులు, వస్తువులను తనిఖీ చేసుకున్నారు. దీంతో ఇంట్లో ఉన్న రెండున్నర కేజీ వెండి, రూ.40వేలు నగదు దొంగలించబడినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఏఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు



బీరువా తలుపు తెరిచి వస్తువులు చిందరవందరగా పడేసిన దృశ్యం

జోరుగా వరి నాట్లు

నందవరం: వానలు కురిసి తుంగభద్రలో పాక్షికంగా వరద నీరు పారుతుడడంతో తుంగ తీరం వెంట వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. తుంగ తీరం దాదాపు 24 కిలో మీటర్ల వరకు వరి నాట్లు ఊపందుకున్నాయి. తీరప్రాంతాలలో నేల తల్లిబిడ్డల మోములో ఆనందం నింపింది. వరి రైతులు నాట్లకు నడుం బిగించడంతో తీరమంతా సందడి నెలకొంది. నది తీర ప్రాంతాలైన నదికైరవాడి, గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి గ్రామాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. రైతులు, వ్యవసాయ కూలీలు వరినాట్లలో బిజీ బిజీగా ఉన్నారు. చిన్నకొత్తిలి గ్రామంలో వరి మడి గట్ల మీద ఒకే బంతిలా వ్యవసాయ కూలీలు సద్దులు ఆరగిస్తూ సందడి చేశారు. మండలంలో ఇప్పటివరకు 600 ఎకరాలలో రైతులు వరి నాట్లు వేశారు. మండలంలో దాదాపు 3,000 ఎకరాల్లో వరి సాగవుతున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వానలు కాస్త ఆలస్యమైనా ఓ మోస్తరుగా కురవడంతో ఎన్నో ఆశలతో నాట్లకు సిద్ధపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు అండగా వరికి గిట్టుబాటు ధర కల్పించింది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు 35 నుంచి 45 బస్తాల దిగుడులు లభిస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నాగలదిన్నెలో నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



మంత్రాలయంలో మొక్కలు నాటుతున్న నాయకులు



కోసిగిలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంత్రాలయం: ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు జి.భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో రాఘవేంద్ర సర్కిల్‌లో రాఘవేంద్ర స్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నమస్కరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, చిన్నారుల మధ్య కేక్ కట్ చేశారు. ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయంలో రచ్చుమర్రి గ్రామ నాయకులు వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డితో కేక్ కట్ చేయించారు. మరో వైపు తుంగభద్ర గ్రామంలో మండల ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కాచాపురం ఉప సర్పంచ్ సయ్యద్ అహ్మద్ ఆధ్వర్యంలో దస్తగిరయ్య స్వామి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకుని నారికేళాలు సమర్పించి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అభిమానులు తెల్లవారుజామునుంచి శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో మూలరాములకు కనకాభిషేకం, జామీయా మసీదులో, సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి స్వీట్స్ పంపిణీ చేశారు. నాయకులు మల్లిఖార్జున, రాఘవేంద్ర, అంజినేయులు, వీరనాగుడు తదితరులు ఉన్నారు.

కౌతాళం: స్థానిక సహకార సంఘం కార్యాలయంలో సింగిల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణం రాజు, యువ నాయకులు రాఘవేంద్ర రెడ్డి, సుబ్బారాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. మండల కన్వీనర్ ప్రహ్లాద ఆచారి, నాయకులు గిరి, ఉపేంద్ర, ఈరేశప్ప, సర్పంచ్ పాల్ దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి జన్మదినం సందర్భంగా మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, నాడుగేని నాగరాజు, మాణిక్యరాజు, మంగమ్మ, నరసింహులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కోసిగిలోని ప్రభుత్వ హస్పిటల్‌లో స్టాఫ్‌నర్స్ రాఘవేంద్ర సమక్షంలో గర్భిణులు, బాలింతలకు పాలు, బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. అలాగే ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో ఆలయ స్వామి ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులు మల్లికార్జున గౌడ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయించారు.



కౌతాళంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ మండల నాయకులు

దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు గ్రామ శివారులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్‌లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఎంపీసీలో ఎస్సీ-15, ఎస్టీ-2, సీఈసీలో ఎస్సీ-12, ఎస్టీ-1, హెచ్ఈసీలో ఎస్సీ-24, ఎస్టీ-2 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26న పాఠశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. పదో తరగతిలో రెగ్యులర్‌గా పాసైన అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని, అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్ల నకళ్లను దరఖాస్తుకు జతచేయాలని సూచించారు.

మణిపూర్ ఘటన దేశానికే మచ్చ

ఆలూరు: మణిపూర్ ఘటన దేశానికే మాయని మచ్చ అని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు మహానంది అన్నారు. ఆ ఘటనను ఖండిస్తూ ఆలూరులో ఆదివారం మాల మహానాడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆడపడుచులను వివస్త్ర చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు నాయకులు ఈరన్న, లక్ష్మీనారాయణ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: మణిపూర్‌లో మహిళను వివస్త్ర చేసి అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య కార్యదర్శి ఈరమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేసి సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేశారు. ఆమె మాట్లాడుతూ.. మణిపూర్ మారణహోమాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించి మున్ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమాఖ్య నాయకులు నాగవేణి, ఉరుకుందమ్మ, లక్ష్మి, సరోజ, రంగవేణి, సీపీఐ నాయకులు రంగన్న, భాస్కర్‌యాదవ్, సమీవుల్లా పాల్గొన్నారు.



ఆలూరులో ర్యాలీ చేస్తున్న మాలమహానాడు నాయకులు

పకడ్బందీగా ఓటర్ల జాబితా సవరణ

- ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభమైన ఇంటింటి సర్వే
- ఆగస్ట్ 21వ తేదీ వరకు సర్వే చేయనున్న బీఎల్‌ఓలు
- ఓటర్ల లిస్ట్‌లో మార్పులు, చేర్పులకు అవకాశం
- అక్టోబర్ 17న తుది జాబితా ప్రచురణ



ఆర్లబండలో ఇంటింటి సర్వే చేస్తున్న బీఎల్‌ఓలు

కోసిగి: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈనెల 21వ తేదీ నుంచి ఆగస్ట్ నెల 21వ తేదీ వరకు బూత్ లెవెల్ ఆఫీసర్లు ఇంటింటికి వెళ్లి సర్వే చేసేందుకు సంసిద్ధం చేశారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారందరికీ ఓటు హక్కు కల్పిస్తారు. నియోజకవర్గవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణపై బూత్ లెవెల్ అధికారులకు ఇప్పటికే మండల కేంద్రాల్లో శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పించారు. ఓటర్ల సవరణ జాబితా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. మంత్రాలయం నియోజకవర్గంలో కోసిగి, కౌతాళం, పెద్దకడబూరు, మంత్రాలయం మండలాలలోని తహసీల్దార్ల ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి సర్వే ప్రారంభించారు. బీఎల్‌ఓలుగా వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగస్తులను నియమించి ఓటర్ల సవరణ ప్రక్రియ చేపడుతున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో 18.04.2023 నాటికి 236 పోలింగ్ బూత్‌ల పరిధిలో 1,94,555 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

బీఎల్‌ఓలు సర్వే చేయాల్సిన అంశాలు

- ఓటర్ల జాబితాలో పేర్లు డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓటర్లు ఉంటే తొలగించడం
- చనిపోయిన వారి పేర్లు గుర్తించి తొలగించడం
- ఓటర్ జాబితాలో పేర్లు తప్పులు ఉన్నా, ఇంటి నెంబర్లు తప్పులు ఉన్నా క్షేత్రస్థాయిలో పరిశీలించి మార్పులు చేయడం
- దీర్ఘకాలికంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను వారి ఇష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉండాలో అడిగి అక్కడికి మార్పు చేస్తారు.
- ఒక పోలింగ్ కేంద్రంలో 1500 మందికి పైగా ఓటర్లు ఉంటే కొత్త కేంద్రానికి మార్పు చేస్తారు.

మండలాల వారీగా ఓటర్ల జాబితా వివరాలు

మండలం	పోలింగ్ బూత్‌లు	ఓటర్లు
కోసిగి	61	49,380
కౌతాళం	69	56,451
మంత్రాలయం	57	45,352
పెద్దకడబూరు	49	43,352
మొత్తం	236	1,94,555

- ఓటర్ల అభిప్రాయం మేరకు అనువుగా ఉండే పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసుకునేందుకు పోలింగ్ బూత్‌లలో నమోదు చేయించుకునే అవకాశం కల్పించారు.
- 18 ఏళ్లు పైబడిన వారు ఓటు హక్కు కోసం బీఎల్‌ఓలకు ఆధార్ కార్డు, ఒక ఫొటో అందించి నమోదు చేసుకోవచ్చును.

ఈనెల 21వ తేది నుంచి ఆగస్ట్ 21వ తేదీ వరకు బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ తిరిగి సర్వే పూర్తి చేయిస్తారు. ఆగస్ట్ 22 నుంచి సెప్టెంబర్ 29వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాల సర్దుబాటు, విభజన, ప్రతి పోలింగ్ కేంద్రానికి 1500 మంది ఓటర్లు ఉండేలా సర్దుబాటు చేయడం, తక్కువ ఎక్కువ ఉన్న చోట వేరొక పోలింగ్ కేంద్రానికి మార్పులు చేస్తారు. ఓటర్ కార్డులో, జాబితాలో ఫొటోలు తప్పుగా ఉంటే మార్పులు చేసి ఎన్నికల కమిషన్ ఆమోదానికి పంపుతారు. డిసెంబర్ 26వ తేదీ నాటికి ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించి, జనవరి 5న తుది జాబితా ప్రదర్శించనున్నారు.

పకడ్బందీగా సర్వే చేయిస్తున్నాం



ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రక్రియను బీఎల్‌ఓలతో ఇంటింటికీ వెళ్లి పకడ్బందీగా సర్వే చేయిస్తున్నాం. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చు. ఓటర్ కార్డులో ఎలాంటి తప్పులు ఉన్నా ఇంటి వద్దకు వచ్చిన బీఎల్‌ఓలకు తెలియజేసి మార్పులు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి. – రుద్రగౌడ, తహసీల్దార్, కోసిగి

వర్షపు నీటి తొలగింపు



కోసిగిలో రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో చిన్నపాటి వర్షానికే నీరు రోడ్డుపై నిల్వ ఏర్పడుతోంది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, పంచాయతీ కార్యాలయం ముందు భాగంలో భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సర్పంచ్ అయ్యమ్మ ప్రత్యేకంగా జేసీబీ ఏర్పాటు చేసి రోడ్డు పక్కన కాల్వ తవ్వించి తాత్కాలికంగా నీటిని మళ్లించేలా చేపట్టారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



జేసీబీతో వర్షపు నీటిని తొలగిస్తున్న దృశ్యం